నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 28 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

నిరుద్యోగ యువకులకు ఉద్యోగావకాశాలు

- జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 27 : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని, ఈ నెల 29న ఉదయం 11 గంటలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితి తెలిపారు. 35 సంవత్సరాల లోపు యువకులకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ 28 ఖాళీలకు పదో తరగతి అర్హతతో రూ.15 వేల జీతంతో పాటు ఇతర అలవెన్స్, గ్రూప్ లీడర్స్ రెండు ఖాళీలకు డిగ్రీ అర్హతతో రూ.24 వేల జీతంతోపాటు ఇతర అలవెన్స్ ఉంటాయని పేర్కొన్నారు. టీమ్ లీడర్ ఒక పోస్టుకు డిగ్రీ అర్హతతోపాటు రెండు సంవత్సరాల అనుభవం ఉండాలని, వారికి సంవత్సరానికి రూ.ఆరు లక్షల జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29న విద్యార్హతల సర్టిఫికెట్స్, జీరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

జీతాలు మహాప్రభో..₹

- ఐదు నెలలుగా పెండింగ్‌లో పెట్టిన కాంగ్రెస్ సర్కారు
- అరకొర జీతాలే.. అయినా సకాలంలో చెల్లిస్తలే..
- ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వలేదంటున్న అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న హాస్టల్ సిబ్బంది

మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బందికి వేతనాల్లేవ్

సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగమైన తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్ల (కేజీబీవీ టైప్-4)లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించడంలేదు. ఆదర్శ పాఠశాల వసతి గృహాల్లో ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. అరకొర జీతాలకు పనిచేస్తున్నా కనీసం సర్కారు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వకపోడంతో ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. దాంతో సిబ్బందికి తీవ్ర అవస్థలు తప్పడం లేదు.

- యాదాద్రి భువనగిరి, జూన్ 27 (నమస్తే తెలంగాణ)

తెలంగాణ ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. కొత్త సర్కారు వచ్చి ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకు పైసా ఇవ్వలేదు. జనవరి నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 30 హాస్టళ్లు ఉండగా, యాదాద్రి భువనగిరిలో ఏడు వసతి గృహాలు ఉన్నాయి. ఒక్కో హాస్టల్‌లో ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో వార్డెన్, కేర్‌టేకర్, ఏఎన్ఎం, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌ఉమన్ పనిచేస్తున్నారు. వీరంతా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే. ఉమ్మడి జిల్లాలో 197 మంది స్టాఫ్ ఉండగా, యాదాద్రి భువనగిరిలో 42 మంది, నల్లగొండలో 101, సూర్యాపేటలో 54 మంది పనిచేస్తున్నారు. సర్వశిక్ష అభియాన్ కింద పనిచేస్తున్న వీరంతా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు.

నారాయణపురం మోడల్ స్కూల్ బాలికల హాస్టల్

ఆర్డర్ కాపీలు లేకుండానే విధులు

కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది కంటే ఆదర్శ పాఠశాల హాస్టల్ సిబ్బందికి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. వీరంతా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బంది పని చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఎవరికీ ఆర్డర్ కాపీలు రాలేదు. సాధారణంగా ఆర్డర్ కాపీలు ఇస్తే అన్ని రకాలు బెనిఫిట్స్ పొందే అవకాశం ఉంటుంది. కానీ ఆర్డర్ కాపీలు లేకపోవడంతో అన్ని విధాలుగా నష్టపోతున్నారు. ఆర్డర్ కాపీలు ఇప్పించాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

కష్టంగా కుటుంబ జీవనం

హాస్టళ్లలో సిబ్బంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరందరికీ అరకొర జీతాలు చెల్లిస్తున్నారు. కనీస వేతనాలు కూడా లేకుండా అతి తక్కువ జీతాలకే కొనసాగుతున్నారు. వార్డెన్‌కు రూ. 13వేలు, ఇతరులకు రూ. 7,800 వరకు చెల్లిస్తున్నారు. వీళ్లంతా 24గంటలు సేవలు నిర్వహిస్తూనే ఉంటారు. బయట అటెండర్ కంటే తక్కువ జీతాలకు పనిచేస్తున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే బడ్జెట్ రాలేదని, సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. డైట్ బిల్లులతో పాటుగా ఇస్తుండటంతో ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు. ఇంటి అద్దెలు, నిత్యావసరాలు, పిల్లల ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో నెలనెలా జీతాలు అందితేనే కుటుంబాలను కష్టంగా వెల్లదీసే కాలంలో.. అసలే వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీతమే ఆధారమని, నెలల తరబడి పెండింగ్‌లో పెడితే ఎలా అని చెప్పుకొస్తున్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాయకులు

కేసీఆర్‌తో బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య



కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేత ర్యాకల శ్రీనివాస్

యాదగిరిగుట్ట, జూన్ 27 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆ పార్టీ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య గురువారం ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రసాదాన్ని అందజేశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో పార్టీ మాసాయిపేట గ్రామ శాఖ అధ్యక్షుడు గుణగంటి బాబురావుగౌడ్, యువజన నాయకుడు ఆవుల సాయి ఉన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆ పార్టీ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ కూడా గురువారం ఎర్రవల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు కేసీఆర్ శాలువా కప్పి సన్మానించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కేసీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

అసమర్థ పాలనతో రాష్ట్రం భ్రష్టు పట్టింది

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

తుర్కపల్లి, జూన్27 : కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలనతో రాష్ట్రం భ్రష్టు పట్టిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. తుర్కపల్లి మండలంలోని ఇబ్రహీంపురంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సబ్బండ వర్గాల ప్రజలు సంతోషంగా జీవించారన్నారు. ఎన్నికల్లో గెలుపే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాక సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అభివృద్ధిలో అన్ని రంగాల్లో విఫలమైందని, కాంగ్రెస్ ఏడు నెలల పాలనలో ప్రజలు అన్ని విధాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 2014కు ముందు ఉన్న వలసవాదుల పాలనను ప్రస్తుతం తలపిస్తుందన్నారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగులు, నిరుద్యోగులు రోడ్ల మీదకు వచ్చి ఉద్యమాలు చేస్తున్నారని, సామాన్య ప్రజలకు రక్షణ కరువైందని చెప్పారు. అంతకు ముందు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బూరుగు మధుసూదన్‌రెడ్డి తండ్రి పెంటల్‌రెడ్డి ఇటీవల చనిపోగా, ఆయన చిత్ర పటం వద్ద సునీత నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల దత్తాయిపల్లి పాల సంఘం చైర్మన్‌గా ఎన్నికైన ఎద్దు నర్సింహతో పాటు డైరెక్టర్ గిద్దె సుధాకర్ సునీతను మర్యాదపూర్వకంగా కలువగా వారిని శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, పార్టీ మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్, ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, మాజీ ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, రాజయ్య, భాస్కర్‌నాయక్, రఘురాములు, ఐలేశ్, గుండా ప్రభాకర్, రాజేశ్ పాల్గొన్నారు.

నేడు డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం

డీసీఓ సమక్షంలో నల్లగొండలో బలపరీక్ష

- 14 మంది మద్దతు ఇస్తే నెగ్గే అవకాశం
- బీఆర్ఎస్ సభ్యుల మద్దతు నాకే : చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 27 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై సభ్యులు పెట్టిన అవిశ్వాసంపై శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్ర కార్యాలయంలో బల పరీక్ష జరుగనుంది. డీసీఓ కిరణ్ కుమార్ సమక్షంలో ఉదయం 11 గంటలకు అవిశ్వా పరీక్ష నిర్వహించనుండగా గెలుపుపై ఎవరి అంచనాలు వారికే ఉన్నాయి. సహకార డైరెక్టర్లుగా మొత్తం 20 మంది ఉండగా, అందులో ఒక సీటు ఖాళీగా ఉంది. మిగిలిన 19 మంది సభ్యుల్లో 14 మంది మద్దతు ఎవరికో గెలుపు వారిది కానుంది. అయితే చైర్మన్ మహేందర్ రెడ్డిపై ఈ నెల 10న ఇచ్చిన నోటీసులో 14 మంది తమ సంతకాలు పెట్టి డీసీఓకు అందజేయగా వారిలో నేడు జరిగే ఓటింగ్ సమయానికి ఎవరు ఎటు వైపు ఉంటారో ప్రశ్నార్థకంగా మారింది. డీసీఓకు ఇచ్చిన నోటీసులో 14 మంది సభ్యులు ఉండగా అందులో విదేశాల టూర్‌లో ఉన్న డీసీసీబీ వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్ రెడ్డి మద్దతు కూడా తమకే ఉంటుందనేది అవిశ్వాసం పెట్టిన వారి మాట. దయాకర్ రెడ్డి విదేశాల నుంచి బుధవారం వచ్చినట్లు తెలుస్తుండగా ఆయన ఎవరికి మద్దతిస్తారనేది నేడు తేలనుంది. హుజూర్‌నగర్‌కు చెందిన అప్పిరెడ్డి, రంగాచారి, దేవరకొండకు చెందిన పల్లా ప్రవీణ్ రెడ్డితోపాటు మరొకరు చైర్మన్ వెంట ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ ఐదుగురు మద్దతుతోపాటు ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే ఉండి కాంగ్రెస్ కండువాలు కప్పుకోని సుష్మ, కరుణ, జయరాం నాయక్ కూడా తనకే మద్దతు ఇస్తారనే విషయాన్ని మహేందర్ రెడ్డి బలంగా విశ్వసిస్తున్నారు. వారు ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నందున గొంగిడికే మద్దతు పలుకుతారా లేదా విపక్ష కూటమికి మద్దతు ఇస్తారా అనేది ఆసక్తిగా మారింది.

15 రోజులుగా క్యాంపులో..

చైర్మన్ మహేందర్ రెడ్డిపై ఈ నెల 10న అవిశ్వాస నోటీస్ ఇచ్చిన విపక్ష కూటమి సభ్యులు మరుసటి రోజు నుంచి కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పర్యటిస్తూ క్యాంపులో ఉన్నారు. వారు శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయానికి చేరుకోనున్నారు. క్యాంపునకు బీఎస్పీలో ఉన్న అంజయ్య, వైస్ చైర్మన్ ఎసిరెడ్డి దయాకర్ రెడ్డితోపాటు చైర్మన్ వెంట ఉన్న వారు వెళ్లలేదు. చైర్మన్ పదవి ఆశించిన మునుగోడు నియోజకవర్గ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఈ క్యాంపు నిర్వహించారు. 14 మంది ఎవరికి మద్దతు ఇస్తే వారే కొత్త చైర్మన్‌గా ఎన్నిక కానుండగా, కొత్త పాలక వర్గం టర్మ్ కూడా వచ్చే ఏడాది ఫిబ్రవరితో పూర్తి కానుంది.

పార్టీ మారితే వచ్చే పదవి వద్దనే కాంగ్రెస్‌లోకి వెళ్లలేదు

గొంగిడి మహేందర్ రెడ్డి, చైర్మన్ డీసీసీబీ

నల్లగొండ డీసీసీబీ బ్యాంకు అవినీతిలో కూరుకుపోతే దాన్ని ఎంతమేరకు అభివృద్ధి చేశానో రైతులు, ఉద్యోగులు, ప్రస్తుత డైరెక్టర్లకు తెలుసు. అన్ని తెలిసిన వారు అవిశ్వాసం పెడితే ఏం చేస్తాం. పైగా పార్టీ మారితే నా పదవి నాకే ఉంటుందని కాంగ్రెస్ వాళ్లు ఆఫర్ చేశారు. రాష్ట్రంలో 9 డీసీసీబీలు ఉంటే అందులో కరీంనగర్, నల్లగొండ తప్ప మిగిలిన ఏడుగురు బీఆర్ఎస్ చైర్మన్‌లే. కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో వాళ్లకు పదవులు అట్లనే ఉన్నయి. ఆ పదవుల కోసం కేసీఆర్‌ను వదిలి వెళ్లలేమని ఉన్నాను. అయినా నా వెంట ఐదుగురు సభ్యులు ఉన్నారు. వారితోపాటు క్యాంపునకు వెళ్లిన వారిలోనూ ముగ్గురు మా పార్టీ వారే. వారు నాకే మద్దతు ఇస్తారని నమ్ముతున్నా.

ఎమ్మెల్యే సామేల్ ప్రోదల్బంతోనే శిలాఫలకం మాయం

- జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి
- పాటిమట్లలో మిషన్ భగీరథ ట్యాంకు ప్రారంభంలో రసాభాస
- శిలాఫలకం తెప్పించాలని ఆదేశించినా పట్టించుకోని అధికారులు

మోత్కూరు మండలం పాటిమట్లలో మిషన్ భగీరథ మంచి నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

మోత్కూరు, జూన్ 27 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రోదల్బంతో కాంగ్రెస్ నాయకులు శిలాఫలకం నేమ్ బోర్డును మాయం చేశారని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని పాటిమట్ల క్రాస్ రోడ్డులో రూ.18లక్షల జడ్పీ నిధులతో నిర్మాణం చేసిన మిషన్ భగీరథ మంచి నీటి ట్యాంకును గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే సామేల్ పేరును ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకం మీద పెట్ట లేదంటూ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు శిలాఫలకం నేమ్ బోర్డును మాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ప్రొటోకాల్ నిబంధనలు ఉంటాయని, ప్రజల దాహార్తి తీర్చడం కోసం గతేడాది రూ.18లక్షల జడ్పీ నిధులతో అప్పటి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. ప్రొటోకాల్ విషయంలో అభ్యంతరాలు ఉంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి నీచ రాజకీయాలను తాము చేయలేదన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం ఎమ్మెల్యే సామేల్ పని చేయాలని, ఇలాగే వ్యతిరేకతకు పాల్పడితే రానున్న ఎన్నికల్లో సామేల్ ప్రజల తిరస్కరణకు గురికాక తప్పదని హెచ్చరించారు. నేమ్ బోర్డు తెప్పించాలని ఆదేశించినప్పటికీ ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ వెంకటేశ్ నిమ్మకుండి పోయారు. నేమ్ బోర్డు మాయం చేసిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఏఈ వెంకటేశ్‌ను ఆదేశించారు. ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఐ నాగరాజును ఆదేశించారు. నేమ్ బోర్డును అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు తీసుకురాకపోవడంతో జడ్పీ చైర్మన్, అధికారులు కొబ్బరికాయ కొట్టి ట్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్డగూడూరు ఎంపీపీ దర్శనాల అంజయ్య, జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి అయోధ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, గిరగాని శ్రీనివాస్, నాయకులు కొండ సోంమల్లు, బాలెంల అరవింద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోత్కూరులో ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంత్ జెండగే

ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంత్ జెండగే

మోత్కూరు, జూన్ 27: ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మోత్కూరు తాసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ధరణి పెండింగ్ దరఖాస్తులు, రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ధరణి మోడ్యూల్‌కు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఆయన వెంట తాసీల్దార్ రాంప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు దాసరి శ్రీనివాస్, సుమన్ ఉన్నారు.

471 మంది ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి

భువనగిరి అర్బన్, జూన్ 27 : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. 1ందులో భాగంగా ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)గా పదోన్నతి కల్పిస్తూ జాబితాను గురువారం ప్రకటించారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఎస్జీటీకి సంబంధించి పదోన్నతుల కోసం సీనియారిటీ జాబితాను ఈ నెల 24న ప్రకటించారు. ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం వెబ్ ఆప్షన్ సదుపాయాన్ని కల్పించారు. దాంతో జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి పదోన్నతి పోస్టులు 503 ఖాళీలు ఉన్నాయి. జిల్లాలో 1,229 మంది ఎస్జీటీలు ఉన్నారు. వీరిలో ప్రాథమిక పాఠశాలల హెచ్ఎం, తెలుగు, హిందీ, జీవ, గణిత, భౌతిక, సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, వ్యాయామ విద్య, ప్రత్యేక విద్య చేసిన వారు ఉన్నారు. జిల్లాలో మొత్తం 471 మందికి ఎస్ఏలుగా పదోన్నతులు లభించాయి. కొంత మంది ఉపాధ్యాయులు రెండు సబ్జెక్టులు చొప్పున అర్హత కలిగి ఉండి వెబ్ ఆప్షన్ పెట్టుకోవడంతో వారికి రెండు చొప్పున పదోన్నతులు వచ్చాయి. ఏదో ఒక్క ఖాళీలో మాత్రమే వీరు చేరడంతో 32 పోస్టులు ఇంకా ఖాళీగానే మిగిలిపోయాయి. కాగా ఎస్ఏ స్థాయి మొత్తం ఖాళీలలో 70 శాతం పదోన్నతులు, మరో 30 శాతం డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు.

గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల బదిలీకి దరఖాస్తులు

నల్లగొండ/రామగిరి, జూన్ 27: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు తాము కోరుకునే పాఠశాలలో బదిలీ కోసం ఈ నెల 27నుంచి జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని రీజినల్ కోఆర్డినేటర్ హెచ్. అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవకాశం ఉందని, ఆన్‌లైన్‌లో రూ. 100 చెల్లించి https://tgswadtr.cgg.gov.in దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అలాగే 5నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 26నుంచి జూలై 12లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

చౌటుప్పల్ పీఏసీఎస్ పాలకవర్గం తిరిగి బాధ్యతలు

చౌటుప్పల్, జూన్ 27 : హైకోర్టు ఉత్తర్వుల మేరకు చౌటుప్పల్ పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు తిరిగి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సంఘం సర్వసభ్య సమావేశాలు సక్రమంగా నిర్వహించలేదన్న ఆరోపణలతో ఈ పాలకవర్గాన్ని ఈ నెల 22న డీసీఓ ప్రవీణ్‌కుమార్ రద్దు చేశారు. దాంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆ సంఘం వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్‌ను పర్సనల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రకటించారు. డైరెక్టర్లుగా సీపీఎంకు చెందిన బోరెం నర్సిరెడ్డి, బీజేపీకి చెందిన బాతరాజు సాయిలు, దూర్క కృష్ణ, సప్పిడి వెంకట్‌రెడ్డి, బొడ్డు పద్మను నియమించారు. ఈ క్రమంలో ఏకపక్ష నిర్ణయంతో, రాజకీయ దురుద్దేశంతో సంఘం రద్దు చేశారని బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, ఆ పార్టీ డైరెక్టర్లు దుబ్బాక శశిధర్‌రెడ్డి గుండెబోయిన రూపమ్మ, పబ్బతి వెంకటేశం గౌడ్, దొడ్డి శ్రీశైలం, దౌడి బాలరాజు, పానుగోతు సూర్య హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే ఇవ్వడంతో గురువారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. అనంతరం సంఘం చైర్మన్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ డీసీఓ ఏకపక్ష నిర్ణయంతో కమిటీ రద్దు చేశారని, చివరకు న్యాయమే గెలిచిందని అన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న సంఘం చైర్మన్, డైరెక్టర్లు

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులకు దరఖాస్తులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 27 : ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు ఇచ్చేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని చేనేత, జౌళి సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. డిసెంబర్ 31, 2023 నాటికి 30 సంవత్సరాలు నిండిన వారు, 10 సంవత్సరాలు చేనేత రంగంలో అనుభవం కలిగి ఉండాలని, చేనేత డిజైనర్స్‌కు డిసెంబర్ 31, 2023 వరకు 25 సంవత్సరాలు నిండాలని, చేనేత రంగంలో 10 సంవత్సరాలు తగ్గకుండా అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. పై అర్హతలు కలిగిన వారు దరఖాస్తులను నింపి, నైపుణ్యతను చాటే నమూనాలను జౌళి సహాయ సంచాలకులు, జిల్లా కార్యాలయానికి పంపించాలని తెలిపారు. నైపుణ్యత ఆధారంగా ఎంపిక చేసి అవార్డు గ్రహీతకు రూ.25వేల నగదు, చేనేత శాలువా, మెమెంటో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.